కాల్వల నిర్వహణపై నిర్లక్ష్యం

- దుస్థితిలో సాగునీటి పంట కాలువలు
- ఆనవాళ్లు కోల్పోతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



వీరపనేనిగూడెం రహదారిలో రూపు కోల్పోయిన పంట కాలువ



తెంపల్లి రోడ్డులో ఆనవాళ్లు కోల్పోయిన పంట కాలువ



మర్లపాలెం రోడ్డులో కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు

గన్నవరం రూరల్: వ్యవసాయానికి ఊతమిచ్చి సాగునీరు సరఫరా చేసే పంట కాలువల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. మండలంలో 21 గ్రామాలుండగా, వీటిలో 17,500 ఎకరాల్లో వరి సాగవుతోంది. ఉద్యాన పంటలు మూడు వేల ఎకరాల్లో సాగులో ఉన్నాయి. ఇవిగాక కూరగాయలు, మామిడి తోటలు వేలాది ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు.

దుస్థితిలో పంటకాల్వలు

ఏ గ్రామంలో చూసినా రహదారుల వెంట పెద్ద పంట కాలువలు ఉంటాయి. వాటి నిండా కంప చెట్లు పేరుకుపోయాయి. పొదలు దట్టంగా మొలిచాయి. పంట కాల్వల వెడల్పు తగ్గిపోయాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అసలు ఆనవాళ్లే కోల్పోతున్నాయి.

ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యం

ప్రతి సంవత్సరం గ్రామ గ్రామానా పంట కాల్వలు పర్యవేక్షించాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు ఆ సంగతి మరిచాయి. దీంతో ఆక్రమణలు పెరిగిపోయాయి. స్వరూపం కోల్పోతున్నాయి. వ్యవసాయంలో కౌలు రైతులు పెరగటంతో యజమానులు పంటకాల్వల పర్యవేక్షణ పట్టించుకోవటం లేదు. దీంతో ప్రభుత్వ రెవెన్యూ కొలతల ప్రకారం ఉండాల్సిన పంట కాల్వలు రోజురోజుకు కుంచించుకుపోతున్నాయి.

వెంచర్ల వద్ద మరీ దారుణం

భూముల ధరలు పెరగటంతో అన్ని గ్రామాల్లోనూ రియల్ ఎస్టేట్ వెంచర్‌లు వెలిశాయి. ఈ దెబ్బకు పంట కాలువల్లో చిన్నపాటి తూములు వేసి వాటిని సైతం ఆక్రమించేశారు. వెంచర్ దారులకు రాజకీయ మద్దతు ఉండటంతో రైతాంగం మిన్నకుండిపోతున్నారు.

ఉపాధి పథకంలో అభివృద్ధి చేయాలి

ఏటా ఎన్‌ఆర్‌ఈజీఎస్ (ఉపాధి హామీ పథకం) ద్వారా పంట కాలువల తవ్వకాన్ని చేపడుతున్నారు. ఈ వేసవిలో ఉపాధి కూలీలతో పంట కాలువలు తవ్వించారు. అయితే కొన్ని పంట కాలువల తవ్వకం చేపట్టలేదు. వీటిపై శ్రద్ధ పెట్టాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ సీజన్ నాటికి పంట కాలువలు తవ్వించి సాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

పంటకాల్వల్లోనే వ్యర్థాలు

గ్రామాల్లో వ్యర్థాలను ఈ పంట కాలువల్లో డంప్ చేస్తున్నారు. గ్రామాల్లో డంపింగ్ యార్డులు లేని కారణంగా పంచాయతీలు వ్యర్థాలను తరలిస్తూ రోడ్ల వెంట పెద్ద పంట కాలువల్లోకి వ్యర్థాలను వేస్తున్నారు. భారీ భోజన కార్యక్రమాల నిర్వహణ సందర్భంగా వచ్చే వ్యర్థాలను కూడా పంట కాలువల్లో రోడ్ల వెంట పడవేయటం ఆనవాయితీగా మారిపోయింది.

పంట కాలువలు బాగుజేయాలి



గ్రామాల్లో పంట కాలువలు సర్వే చేయించి బాగుజేయించాలి. ఖరీఫ్ సీజన్‌కే యుద్ధ ప్రాతిపదికన కాలువలు బాగుజేసి, వ్యవ సాయానికి ఇబ్బందులు లేకుండా చూడాలి. వ్యర్థాలు పంట కాలువల్లో పడవేయకుండా అవగాహన కల్పించాలి. చట్ట ప్రకారంచర్యలు తీసుకోవాలి.

– మిరప నాగేశ్వరరావు, మండల సీపీఎం నాయకుడు

సర్వే చేయించాలి



గ్రామాల్లో పంట కాలువలు సర్వే చేయించాలి. ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి. ప్రధాన కాలువలు బాగుజేయించి రైతులను ఆదుకోవాలి. సాగునీరు నడవక రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు.

– అంగడాల సాంబశివరావు, రైతు, కొత్తగూడెం

భూసార పరీక్షలతో మంచి ఫలితాలు

లాం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్, వేదికపై జిల్లా అధికారి విజయకుమారి

నున్న(విజయవాడరూరల్): భూసార పరీక్షలు నిర్వహించుకుని, పంటలను సాగు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని లాం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ రైతులకు సూచించారు. ఆదివారం నున్న గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్-2025 ప్రీ ఖరీఫ్ కార్యాచరణలో భాగంగా శాస్త్రవేత్తలతో రైతులకు చర్చా గోష్ఠి కార్యక్రమం నిర్వహించారు. రాబోయే ఖరీఫ్ సీజన్లో తీసుకోవలసిన జాగ్రత్తలు పంటలపై వచ్చు వివిధ సస్యరక్షణ చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త కిషోర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో ముందుగా రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆ పరీక్షల్లో వచ్చే ఫలితాల మేరకు వేసవి దుక్కులు, విత్తన శుద్ధి, నారుమళ్ల పోసుకోవడం, నాట్లు, పంటసాగు చేయడం, ఎరువుల వాడకం, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు తెలియజేశారు. గరికపాడు పరిశోధనాస్థానం నుంచి ట్రైనింగ్ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్‌వర్మ, ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయాధికారి డీఎంఎఫ్ విజయకుమారి ఖరీఫ్ సీజన్లో వ్యవసాయ పంటల సాగుకు మేలు రకమైన విత్తనాలు సేకరించాలి. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, గ్రామ రైతులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

• రేషన్.. పరేషాన్



బియ్యం మూట మోసుకువెళ్తున్న చిన్నారులు

రేషన్ సరుకుల కోసం పడుతున్న ఇబ్బందులకు ఈ చిత్రం ఓ నిదర్శనం. పోరంకి గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు రేషన్ దుకాణానికి వెళ్లి బియ్యం తీసుకున్నారు. ఆ బియ్యం మూటను అతికష్టం మీద మోసుకుంటూ ఇంటికి చేర్చారు. అదే రేషన్ ఇంటింటి సరఫరా వాహనాలు ఉంటే ఈ కష్టాలు ఉండేవి కాదంటూ ఆ చిన్నారులను చూసిన వారు వ్యాఖ్యానించారు. ఆదివారం పోరంకిలో కనిపించిన దృశ్యమిది.

– పెనమలూరు

కొనసాగుతున్న మట్టి తవ్వకాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వేలేరులోని చిన్న మల్లమ్మ కుంట చెరువులో అక్రమ మట్టి త్రవ్వకాలు యథేచ్ఛగా సాగాయి. అధికార టీడీపీ అండదండలతో చిన్న మల్లమ్మ కుంట చెరువులో అక్రమార్కులు శనివారం ప్రొక్లెయిన్లు సాయంతో చేపట్టిన మట్టి తవ్వకాలను రెవెన్యూ అధికారులు తాత్కలికంగా నిలిపివేశారు. కానీ అధికారుల ఆదేశాలను సైతం బేఖాతారు చేస్తూ అక్రమ మట్టి తవ్వకాలను ఆదివారం కొనసాగించారు. ట్రాక్టర్లలో మట్టిని బయటకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామంలోని రీ సర్వే నంబర్ 297లో సుమారు 19 ఎకరాల్లో విస్తరించిన చిన్న మల్లమ్మ కుంట చెరువు ఆక్రమణలపై ఇప్పటి హైకోర్టు, లోకాయుక్తాలో కేసులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు సాగిస్తున్నారని గ్రామానికి చెందిన కడియాల సాంబశివరావు ఆరోపించారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

షైనింగ్ స్టార్స్‌గా ఆరుగురు ఎంపిక

హనుమాన్‌జంక్షన్ రూరల్: మండలం నుంచి ఆరుగురు విద్యార్థులు 'షైనింగ్ స్టార్స్'గా ఎంపికైనట్లు బాపులపాడు ఎంఈవో శ్రీరామ్ బాలాసింగ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈ పథకం కింద రూ.20 వేల నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం, మెడల్ అందించనున్నారని చెప్పారు. మచిలీపట్నంలోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగే కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదగా ఈ పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని వీరవల్లికి చెందిన గీతాంజలి హైస్కూల్ విద్యార్థులు సుంకర ఆశ్రిత, ఆరేపల్లి జాహ్నవి దేవి, చింతల లిఖిత, ఇలపర్తి సువర్ణ భవిష్య, వాణి విద్యానికేతన్‌కు చెందిన గుత్తా సురేంద్ర, షేక్ మస్తాన్ వలి షైనింగ్ స్టార్స్‌గా ఎంపికై నట్లుగా ఎంఈవో శ్రీరామ్ బాలాసింగ్ తెలిపారు. ఈ పురస్కారాలకు ఎంపికైన విద్యార్థులు, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఎంఈవో అభినందించారు.

ఇంజినీరింగ్ కళాశాలల్లో అవకతవకలపై చర్యలు తీసుకోండి

ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ అండ్ ప్రొఫెషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీ బ్రహ్మానందరెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ అండ్ ప్రొఫెషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ముఖ్యంగా జేఎన్‌టీయూకేకు అనుబంధంగా ఉన్న స్వయం పాలిత ఇంజినీరింగ్ కళాశాలల్లో అవకతవకల పట్ల అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కొన్ని స్వయం పాలిత కళాశాలలు పరీక్షల నిర్వహణ నుంచి ఫలితాల విడుదల వరకు వ్యవస్థలను నియంత్రిస్తూ విద్యా నైతికతను దెబ్బతీస్తున్నాయని పేర్కొంది. ఆదివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ అండ్ ప్రొఫెషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏపీటీపీఐఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ బ్రహ్మానందరెడ్డి మాట్లాడారు. సీఎస్‌ఈ విభాగం, అనుబంధ శాఖలలో నిబంధనలకు విరుద్ధంగా అర్హతలేని అధ్యాపకులను నియమించి బోధన చేస్తున్నారన్నారు. విద్యార్థులకు సంబంధించి తప్పుడు డేటాను ప్రభుత్వానికి పంపి ఫీజురీయింబర్స్ మెంట్ పొందుతున్న పరిస్థితులు కూడా ఉన్నాయన్నారు. ప్రతి ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలి, అధ్యాపకుల ప్రయోజనాలను రక్షించడానికి ఫ్యాకల్టీ అసోసియేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనుబంధ, స్వయం పాలిత కళాశాలలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో నైతిక విలువలు, నాణ్యతను పెంచేందుకు కృషి చేయాలన్నారు.

వైద్య విద్యార్థినికి 'మానవత' సాయం



గీతికకు ఆర్థిక సాయం అందిస్తున్న రామచంద్రారెడ్డి, దాత మారుబోయిన కోటేశ్వరరావు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతిభావంతులైన విద్యార్థుల చదువుకు పేదరికం అడ్డుకాకూడదనే లక్ష్యంతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సాయం అందిస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. ఉంగుటూరు మండలం తేలప్రోలుకు చెందిన బొకినాల సురేష్ కుమార్తె గీతిక మచిలీపట్నంలోని పింగళి వెంకయ్య ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా గీతిక చదువుకు ఆటంకం ఏర్పడటంతో మానవత హనుమాన్‌జంక్షన్ శాఖను ఆశ్రయించారు. దీంతో మానవత రాష్ట్ర కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు స్పందించి రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ మొత్తాన్ని స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి చేతుల మీదగా వైద్య విద్యార్థిని గీతికకు అందజేశారు. మానవత ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షురాలు నందమూరి జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సీతాల ప్రసాద్, కోశాధికారి జన్యావుల సత్యనారాయణ, వైఎస్సార్ కడప జిల్లా డైరెక్టర్ ఎ.రామానుజుల రెడ్డి, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు బాణాల నరసింహారావు పాల్గొన్నారు.

గొప్ప రాజనీతిజ్ఞుడు ఎన్జీ రంగా



ఆచార్య ఎన్జీ రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తరుణ్ కాకాని, గోగినేని ధనశేఖర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): స్వాతంత్య్ర సమరయోధుడు, గొప్ప రాజనీతిజ్ఞుడు ఆచార్య ఎన్జీ రంగా అని కాకాని ఆశయ సాధన సమితి చైర్మన్ డాక్టర్ కాకాని తరుణ్ అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా, కాకాని వెంకటరత్నం వంటి వారి ఆదర్శాలను ప్రస్తుత తరానికి తెలియచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆచార్య గోగినేని రంగా వర్ధంతిని పురస్కరించుకుని ఎంజీరోడ్డులోని ఆయన విగ్రహానికి ఎన్జీ రంగా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ట్రస్టు అధ్యక్షుడు గోగినేని ధనశేఖర్, డాక్టర్ తరుణ్ కాకాని తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తరుణ్ కాకాని మాట్లాడుతూ ఎన్జీ రంగా, కాకాని వెంకటరత్నం ఇద్దరూ 1900 సంవత్సరంలో గుంటూరు, కృష్ణా జిల్లాల్లో జన్మించినట్లు తెలిపారు. ఇద్దరూ స్వాతంత్య్ర సమరయోధులుగా మారారని, అనేక రైతు ఉద్యమాలకు నాయకత్వం వహించినట్లు తెలిపారు. కాకాని వెంకట రత్నం వ్యవసాయ, పాడి పరిశ్రమ శాఖతో క్యాబినెట్ మంత్రిగా సమాజ అభ్యున్నతికి కృషి చేయగా, ఎన్జీ రంగా దాదాపు మూడు దశాబ్దాల పాటు పార్లమెంటు సభ్యుడిగా పనిచేశారన్నారు. గుంటూరులో వ్యవసాయ విశ్వ విద్యాలయానికి ఎన్‌జీ రంగా పేరు పెట్టినట్లు తెలిపారు. . ఆచార్య ఎన్జీరంగా ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని గోగినేని ధనశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి రవి , భాను, నిఖిల్, కె.బసవ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

రామవరప్పాడు: గ్రామంలో సురక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని పలు ప్రాంతాల్లో తాగునీటి కుళాయిలు, మోటారు బోర్లకు ఆదివారం మరమ్మతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ గ్రామంలో వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులు, మోటారు బోర్ల సహాయంతో తాగునీటిని అందిస్తున్నామన్నారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో కుళాయిలు, బోర్లు మరమ్మతులకు గురయ్యాయని ఫిర్యాదు అందడంతో తక్షణం స్పందించి రిపేరు చేయించినట్లు తెలిపారు. గ్రామంలో నూతన వాటర్ ట్యాంకుల నిర్మాణం పూర్తయ్యిందని, వాటర్ పైప్‌లైన్ విస్తరణ పనులు పూర్తి చేసి గ్రామస్తులకు అతి త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వాహనదారులు పోలీసు, మోటారు వాహనాల నిబంధనలను తప్పక పాటించాలని మూడో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.కిషోర్ బాబు పేర్కొన్నారు. స్థానిక సత్యనారాయణపురం పరిధిలోని బీఆర్‌టీఎస్ రోడ్డులో మూడో ట్రాఫిక్ పోలీసులు వాహనాల బ్లాక్ ఫిల్మ్‌లపై ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో నిబంధనలకు విరుద్ధంగా బ్లాక్ ఫిల్మ్‌లు వాడుతున్న వాహనాలను ప్రత్యేకంగా గుర్తించి, ఆ వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఉన్న బ్లాక్ ఫిల్మ్‌లను వారిచే తొలగింపచేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నిబంధనలు, పోలీసు, మోటారు వాహనాల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వాహనాలకు ముందు, వెనుక అద్దాలకు 70శాతం, సైడు విండోలకు 50శాతం విజిబిలిటి ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు.

క్లుప్తంగా

రూట్స్ ఫౌండేషన్ అవార్డుల పోస్టర్ ఆవిష్కరణ



పెనమలూరు: జూలై ఒకటో తేదీన డాక్టర్స్ డే సందర్భంగా రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవార్డులు ఇస్తామని రూట్స్ అధ్యక్షుడు డాక్టర్ పోలవరపు విజయభాస్కర్ అన్నారు. ఆయన ఆదివారం కానూరులో వివరాలు తెలుపుతూ తమ ఫౌండేషన్ గత 12 సంవత్సరాలుగా క్యాన్సర్‌పై పోరాటం చేస్తోందన్నారు. జూలై 6వ తేదీన ఉత్తమ సేవలు అందించిన వైద్యులకు రూట్స్ అవార్డులు ప్రధానం చేస్తామని, ఆరోగ్య శాఖ మంత్రిని ఆహ్వానించామని తెలిపారు. పోస్టర్‌ను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ విజయవాడలో ఆవిష్కరించారని తెలిపారు. రూట్స్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ చందు శ్రీనివాస్, సభ్యులు ఎం.శర్మ, మాధవి, యలమందయ్య, డాక్టర్ భావనచంద్ పాల్గొన్నారు.

కృపానందం సేవలు అభినందనీయం

గన్నవరం రూరల్: లైబ్రరీ ఉద్యోగిగా కె.కృపానందం సేవలు అభినందనీయమని పురుషోత్తపట్నం గ్రామ పెద్దలు, గ్రంథాలయ కమిటీ సభ్యులు కొనియాడారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో పని చేసి ఉద్యోగ ఉన్నతిపై తేలప్రోలు గ్రంథాలయానికి బదిలీ అయిన కృపానందంకు పురుషోత్తపట్నంలో పలువురు అభినందించారు. అనంతరం వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు వేడుకలు నిర్వహించారు. 40 రోజుల పాటు సమ్మర్ క్యాంపులో పలు పోటీల్లో విజేతలుగా రాణించిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కొమ్మినేని మల్లికార్జునరావు, గుమ్మడి వెంకట్రామయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం అవసరం



కంకిపాడు: ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం అవసరమని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని పునాదిపాడు కాకతీయ విద్యా ట్రస్టు బాలుర వసతి గృహంలో అనుమోలు వంశోద్ధామ్ ఆధ్వర్యంలో 20 మంది విద్యార్థులకు రూ.5 లక్షల నగదు ప్రోత్సాహకాలను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వసతులను సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదల ఎంతో అవసరమని సూచించారు. వంశోద్ధామ్ అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకుని చదువులో మరింత రాణించాలని కోరారు. కార్యక్రమంలో అనుమోలు బాలమురళి, అనుమోలు గణేష్ ప్రసాద్, అనుమోలు హరిబాబు, అనుమోలు రాజేష్, అనుమోలు నవీన్, అనుమోలు బాలాజీ ప్రసాద్, అనుమోలు శ్రీనివాస్, కానూరు రామారావు, తాతినేని విద్యాసాగర్, పిడికిటి సుగుణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



పాయకాపురం(విజయవాడరూరల్): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన పుచ్చలపల్లి సుందరయ్య మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులకు ఆదివారం అభినందన కార్యక్రమం జరిగింది. మొదటి మూడు స్థానాల్లో అత్యధిక మార్కులు, సైన్స్‌లో వందకు వంద మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించి, ప్రోత్సాహక బహుమతులను ఉపాధ్యాయులు అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు సాయి అక్షయ 575 మార్కులు, హర్షవర్ధన్ 571 మార్కులు, అదే విధంగా మోహన్‌కృష్ణ, శ్రీహిత 566 మార్కులతో మొదటి మూడు స్థానాలను సాధించారు. వీరితో పాటు నలుగురు విద్యార్థులు సైన్స్‌లో వందకు వంద మార్కులు సాధించారని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ హుస్సేన్ తెలియజేశారు. ఉపాధ్యాయులు అందరూ కలిసి అన్ని సబ్జెక్టుల్లో పాఠ్యాంశాలను బోధించారని ప్రధానోపాధ్యాయురాలు కృష్ణ పద్మ పేర్కొన్నారు.

అన్నసమారాధన

పెనమలూరు: పోరంకి లక్ష్మీపురం కాలనీలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామివారి ఆలయంలో 21వ వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఆలయంలో నవ పుష్పార్చన పూర్వక శ్రీపుష్పయాగం చేశారు. రాత్రి సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. సోమవారం మహాపూర్ణాహుతి వసంతోత్సవం, తిరు వీధోత్సవం, పవళింపు సేవ పలు పూజా కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగిస్తారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠామహోత్సవం



పెనమలూరు: పోరంకి గ్రామంలో ఆదివారం శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. గ్రామంలో శ్రీసీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ కోదండరామ స్వామి, సిద్ధి గణపతి, సర్వరూప సబ్రహ్మణ్యేశ్వర శిఖర ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా చేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను అన్నసమారాధన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే కర్తవ్యం



ఉయ్యూరు: సంస్కృతి, సంప్రదాయ, సనాతన ధర్మ పరిరక్షణే కర్తవ్యంగా యువత ముందుకు సాగుతూ సమాజానికి ఆదర్శవంతంగా నిలవాలని భగవద్గీత ఉపన్యాసకులు రాధా మనోహర్ దాస్ స్వామీజీ అన్నారు. ఉయ్యూరు పట్టణంలో న్యాయవాది గుండు శ్రీకృష్ణ నివాసానికి ఆదివారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ సమితి సభ్యులు రాపిరెడ్డి హరీష్, చలపాటి రామాంజనేయులు, గొల్లపూడి నాగరాజు, రాపిరెడ్డి సురేష్ బృందం స్వామీజీని కలిసి సత్కరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల కరపత్రం ఆవిష్కరించారు. రాధా మనోహర్ దాస్ స్వామీజీ మాట్లాడుతూ సాంకేతికత అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి చేరుకోవటంతో పాటుగా ప్రతి ఒక్కరి హృదయం భగవంతుడి ధ్యానంతో నిండిపోవాలన్నారు. ఇటీవల హనుమజ్జయంతి సందర్భంగా ఉయ్యూరులో హనుమాన్‌శోభాయాత్ర నిర్వహించిన సభ్యులను అభినందించారు.

యోగాపై శిక్షణ



ఉయ్యూరు: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉయ్యూరు ఏజీఅండ్‌ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం వాకర్స్, పెన్షర్లు, ఉద్యోగులు యోగాసనాలు వేశారు. యోగా గురువులు శ్రీకృష్ణ, మూర్తి ధ్యానం, ప్రాణాయామం, ఆసనాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

బాల సుబ్రహ్మణ్యానికి స్వరాంజలి



విజయవాడ కల్చరల్: జేఎంఎస్ సరాగాలు ఆధ్వర్యంలో సినీ నిర్మాత, గాయకుడు, సినీ సంగీత దర్శకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం సినీ రంగ సేవలను గుర్తుచేసుకుంటూ గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. నిర్వాహకురాలు ఝాన్సీ పర్యవేక్షణలో ఆయన గానం చేసిన తెలుగు, హిందీ, తమిళం, మరాఠీ, చిత్రాలలోని పాటలను గాయనీ గాయకులు ఉష, జానకి, లక్ష్మీదుర్గ, శైలజ, సత్య, సుకన్య, షబానా, శ్రీనివాస్, చెరుకూరి శ్రీనివాస్ ఆలపించారు. వివిధ రంగాలకు చెందిన చింతకాయల చిట్టిబాబు, వెంకట్, ఎస్. బాజీ, జ్ఞాన సుందరి తదితరులు బాలు సినీ రంగ సేవలను వివరించారు. జేఎంఎస్ సంస్థ ఉపాధ్యక్షుడు బాజీ నిర్వహించారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.